నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

అఫ్జల్‌గంజ్: మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. 11 కేవీ ఆగాపురా బజార్ విద్యుత్ ఫీడర్ పరిధిలోని ఆగాపురా నాలా, నమాజ్ గ్రౌండ్, హబీబ్ నగర్ పోలీస్‌స్టేషన్ తదితర ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి 11 గంటల వరకు అంతరాయం ఉంటుందన్నారు. అలాగే గండి హనుమాన్ విద్యుత్ ఫీడర్ పరిధిలోని మల్లెమెట్, మహబూబ్ కాలనీ, నటరాజ్‌నగర్, ఐస్ ఫ్యాక్టరీ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 నుంచి 3.30 గంటల వరకు. తారకరామా ఫీడర్ పరిధిలోని శాలీమార్ ఫంక్షన్ హాల్, జాగృతి కాలేజీ, రామ్‌కోఠి చౌరస్తాలో సాయంత్రం 4 నుంచి 4.30 గంటల వరకు సరఫరా ఉండదన్నారు. సీతారామ్ బాగ్ ఫీడర్ పరిధిలోని గుఫా మందిర్, ఇందిరానగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ శశికళ కృష్ణ

అబిడ్స్: మంగళ్‌హాట్ డివిజన్ నలుమూలలా ప్రజా సమస్యలు పరిష్కరించడంతో పాటు అభివృద్ధి పనులు వేగవంతంగా చేపడుతున్నామని కార్పొరేటర్ శశికళ కృష్ణ పేర్కొన్నారు. శుక్రవారం రాజ్‌దార్కాన్‌పేట్‌లో రూ.11 లక్షలతో సీసీ రోడ్డు పనులు ఆమె ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ..గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ సహకారంతో మంగళ్‌హాట్ డివిజన్ నలుమూలలా కోట్లాది రూపాయాల అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్‌రావు, వెంకటేష్, దేవరాజ్, బబ్లు, రాకేష్ గౌడ్, అభిలాష్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, శ్రీనివాస్ చారి, అనిల్ గౌడ్, జేడి నితిన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ప్రార్థనలు



శాలిబండ: మక్కా మసీదులో శుక్రవారం సామూహిక ప్రార్థనలు ప్రశాంతంగా జరిగాయి. ఈ ప్రార్థనల్లో మాజీ కార్పొరేటర్ మోసిన్ బలాలతో పాటు ముస్లింలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ప్రార్థనల సందర్భంగా దక్షిణ మండలం పోలీసుల ఆధ్వర్యంలో గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు.

మహిళా సాధికారతే లక్ష్యం

పంజగుట్ట: మహిళా సాధికారతే లక్ష్యమని యూనిటీ ఫౌండేషన్ వ్యవస్థాపకులు శ్రీవంశీ తెలిపారు. ఈ నెల 11వ తేదీన మదర్స్‌డే పురస్కరించుకుని యూనిటీ డ్రైవ్ పోర్టల్ ప్రారంభిస్తున్నట్లు, ఈ పోర్టల్ ద్వారా మహిళలకు ఉచితంగా పలు రంగాల్లో శిక్షణ ఇచ్చి వారు వ్యాపారం నిర్వహించి ఆర్థికంగా స్థిరపడేలా చేస్తామని ఆయన పేర్కొన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఫౌండేషన్ ప్రతినిధులు నిఖిల్, లక్ష్మీప్రసాద్‌తో కలిసి మాట్లాడారు. తమ ఫౌండేషన్ ముఖ్యంగా మహిళా సాధికారత, రోడ్డు భద్రతపై అవగాహన, సైబర్ సెక్యూరిటీ విద్యపై పనిచేస్తుందన్నారు. మహిళలకు క్యాండిల్స్, అగర్‌బత్తీల తయారీ, డిజిటల్ మార్కెటింగ్ తదితర అంశాల్లో శిక్షణ ఇచ్చి వారికి సర్టిఫికెట్లు అందజేసి రుణాలు ఇప్పిస్తామన్నారు.

నేటినుంచి బీజేఆర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో అడ్మిషన్లు

ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.విజయ్‌కుమార్

హిమాయత్‌నగర్: నారాయణగూడలోని బీజేఆర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో 2025–28 మొదటి సంవత్సరం ప్రవేశాలకు అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైనట్లు ఆ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.విజయ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ, బీకాం, బీబీఏ, బీఎస్సీ గ్రూపులలో చేరేందుకు ఈ నెల 10 నుంచి 22వ తేదీ వరకు మొదటి విడత వెబ్ ఆప్షన్లు పెట్టుకోవాలన్నారు. ఈ నెల 23న తొలివిడత సీట్ల కేటాయింపు ఉంటుందన్నారు. సీట్లు పొందిన విద్యార్థులు జూన్ 3వ తేదీలోపు కాలేజీలో రిపోర్ట్ చేయాలని సూచించారు. దరఖాస్తు చేసుకునే సమయంలో విద్యార్థులు ఈ కాలేజీకి మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు.

'సండే ఈవినింగ్ టాక్'

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్ ప్రాంగణంలో ఆదివారం 'సండే ఈవినింగ్ టాక్' కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుంది. ఈ సందర్భంగా 'ఈఎన్‌టీ ఎసెన్షియల్స్– ముక్కు, చెవి, గొంతు సమస్యలు' అనే అంశంపై డాక్టర్ ప్రియాంక వల్లూరి ఉపన్యాసం చేస్తారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 040–23001234లో సంప్రదించాలని నిర్వాహకులు తెలిపారు.

పాతబస్తీకి ప్రపంచ స్థాయి గుర్తింపు

మిస్ వరల్డ్ పోటీదారుల పాతబస్తీ పర్యటనతో..

● ఈనెల 13న పాతబస్తీలో హెరిటేజ్ వాక్ ● చార్మినార్, లాడ్‌బజార్ సందర్శన



లాడ్‌బజార్ గాజుల దుకాణాలు

చార్మినార్: చార్మినార్, లాడ్‌బజార్లకు మరోసారి ప్రపంచ వ్యాప్తంగా విశేష ఆదరణ లభించనుంది. హైదరాబాద్‌లో నిర్వహించే మిస్ వరల్డ్ ఈవెంట్‌తో చార్మినార్, లాడ్‌బజార్‌లకు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు దక్కనుంది. ఈ నెల13న సాయంత్రం హైదరాబాద్‌లోని చార్మినార్, లాడ్‌బజార్‌లలో ఈ పోటీదారులతో హెరిటేజ్ వాక్ జరగనుంది. హైదరాబాద్‌తో పాటు చార్మినార్, లాడ్‌బజార్ సాంస్కృతిక వైభవాన్ని, వైవిధ్యాన్ని చారిత్రక ప్రాముఖ్యతను ప్రపంచానికి తెలియజేసేలా హెరిటేజ్ వాక్ నిర్వహించనున్నారు. లాడ్‌బజార్‌లో మిస్ వరల్డ్ ప్రతినిధులు స్థానిక కళాకారులతో మాట్లాడనున్నారు. 120 దేశాల మిస్ వరల్డ్ ప్రతినిధులు హాజరయ్యే ఈ హెరిటేజ్ వాక్ కార్యక్రమం 150కి పైగా దేశాల్లో ప్రత్యక్ష ప్రసారం కానుంది. ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది ప్రజలు ఈ ఈవెంట్‌ను తిలకించనున్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని సీఎం రేవంత్‌రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా అధికార యంత్రాంగం పెద్ద ఎత్తున విదేశీ పర్యాటకులను తెలంగాణకు ఆకర్షించేలా ప్రణాళిలు సిద్ధం చేశారు. చార్మినార్ కట్టడం, లాడ్‌బజార్ ప్రత్యేకతలను మిస్ వరల్డ్ పోటీదారులకు సంబంధిత అధికార ప్రతినిధులు వివరించి వరల్డ్ టూరిస్ట్ డెస్టినేషన్ స్పాట్‌గా ప్రమోట్ చేయనున్నారు.

లాడ్‌బజార్ ప్రత్యేకత..

నిజాం పాలనలో వెలసిన లాడ్‌బజార్‌కు 400 ఏళ్లకు పైగా చరిత్ర ఉంది. బాంగిల్స్ రాజధానిగా ఈ ప్రాంతం సుప్రసిద్ధం. రంగు రంగుల పేర్లు, ఆకట్టుకునే రీతిలో వివిధ రకాల స్టోన్స్, జరీ పనితో కూడిన సంప్రదాయిక గాజులు ఇక్కడి ప్రత్యేకత. ఇక్కడ నాణ్యమైన ముత్యాలు, నగలు సరసమైన ధరల్లో లభిస్తాయి. హస్తకళల హబ్‌గా కూడా పేరుంది. చిత్రకళ, నకాశీ పని, ఇస్లామిక్ ఆర్ట్ వంటి సంప్రదాయిక హస్తశిల్ప వస్తువులు ఇక్కడ లభిస్తాయి. అత్తార్ (సువాసనలు), ఖురాన్ ప్రతులు, సాంస్కృతిక వస్తువులతో ఇది ఇస్లామిక్ ఆర్ట్ కి ప్రతీకగా నిలుస్తుంది. ఓల్డ్ సిటీ రాతి కట్టడాలు (పత్తర్ గట్టి), గ్రానైట్ రోడ్లు, నిజాం కాలం నాటి దుకాణాలు, సాంస్కృతిక సువాసనలు ప్రతి ఒక్కరినీ మంత్ర ముగ్ధులను చేస్తాయి.

చార్మినార్ ప్రత్యేకత...

1591లో మహమ్మద్ కులీ కుతుబ్ షా నిర్మించిన చార్మినార్ కట్టడం హైదరాబాద్ నగరం సంస్కృతి సంప్రదాయాలకు అద్దం పడుతోంది. నాలుగు మినార్లతో కూడిన ఈ స్మారకం ఇండో–ఇస్లామిక్ డిజైన్‌కు నిదర్శనం. ప్లేగు నివారణ తర్వాత నగర స్థాపనకు గుర్తుగా నిర్మించబడింది. 56 మీటర్ల ఎత్తు, 45 మీటర్ల వెడల్పుతో ఇది హైదరాబాద్‌కు 'హార్ట్'గా ఉంది. మినార్లపై నుంచి పాత నగరం, మక్కా మసీదు అద్భుత దృశ్యాలు కనిపిస్తాయి. అంతేకాకుండా నగర అందాలను తనివి తీరా చూడొచ్చు. ప్రపంచ వారసత్వ స్థలంగా గుర్తింపు కోసం ప్రతిపాదించబడింది. చార్మినార్ కట్టడం నిజాం కాలం నుంచి నేటి వరకు హైదరాబాద్ ఐకాన్‌గా నిలుస్తోంది.



చార్మినార్ కొట్టడంతో పాటు లాడ్‌బజార్ గాజుల దుకాణాల వ్యాపార సముదాయం

'ఆపరేషన్ సిందూర్‌ను ఎవరూ ఆపలేరు'

చార్మినార్: భారతీయ సైన్యం ప్రారంభించిన ఆపరేషన్ సిందూర్‌ను ఎవరూ ఆపలేరని రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్ అన్నారు. ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో భారత సైన్యానికి సంఘీభావంగా చార్మినార్ వద్ద రాజీవ్ గాంధీ సద్భావన యాత్ర స్మారక సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పహల్గాం ఉగ్రదాడిలో మరణించిన వారిని స్మరించుకుంటూ వీర జవానులకు దేశం అండగా నిలబడుతుందన్నారు. ఉగ్రవాద ప్రేరేపిత పాకిస్తాన్‌కు మన సైన్యం గట్టిగా బుద్ధి చెబుతోందన్నారు. అనంతరం భారత వీర జవాన్లకు అండగా నిలబడతామని ప్రతిజ్ఞ చేసి వారికి సంఘీభావం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో జి.కన్నయ్య లాల్, ముజాహిద్, పులిపాటి రాజేశ్ కుమార్, ముజీబ్ ఉల్లా షరీఫ్, శ్యామ్‌రావు ముదిరాజ్, ఓం ప్రకాష్ శర్మ, ఇక్బాల్, జబ్బార్, కె. వెంకటేష్, చందు తదితరులు పాల్గొన్నారు.



వీర జవాన్లకు అండగా ఉంటామంటూ ప్రతిజ్ఞ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆసిఫ్‌నగర్‌లో ఫుట్ పెట్రోలింగ్



ఆసిఫ్‌నగర్‌లో ఫుట్ పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు

విజయనగర్‌కాలనీ: ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందించేందుకు శుక్రవారం భారీ ఎత్తున పోలీసులు ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించారు. సౌత్ వెస్ట్‌జోన్ డీసీపీ చంద్రమోహన్ ఆధ్వర్యంలో మెహిదీపట్నం చౌరస్తా నుంచి ఆసిఫ్‌నగర్ పోలీస్‌స్టేషన్ మీదుగా మల్లేపల్లి చౌరస్తా వరకు ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆసిఫ్‌నగర్ పోలీస్ డివిజన్ ఏసీపీ విజయ్ శ్రీనివాస్, ఆసిఫ్‌నగర్ టప్పాచబుత్ర పోలీస్‌స్టేషన్ల ఇన్‌స్పెక్టర్లు నడికుడ ఆనంద్, మల్లేష్‌తో పాటు సిటీ ఆర్మ్‌డ్ రిజర్వ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారులను శాస్త్రీయ కళల్లో ప్రోత్సహించాలి

గన్‌ఫౌండ్రీ: చిన్నారులను శాస్త్రీయ సంగీత కళల్లో ప్రోత్సహించాలని కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత వేదాంతం రాధేశ్యామ్ అన్నారు. శుక్రవారం రవీంద్రభారతిలో నిహారిక కళాక్షేత్రం, భవయామి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆర్ట్స్‌ల ఆధ్వర్యంలో భారత కళోత్సవం 2025 వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై చిన్నారుల ప్రదర్శనలు ఆహుతులను అలరించాయి. అనంతరం పలువురు నాట్య గురువులను ఘనంగా సన్మానించారు.



చిన్నారులతో నాట్య గురువు నిహారిక తదితరులు

టోలిచౌకీలో ఎమ్మెల్యే కౌసర్ పర్యటన



స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. శుక్రవారం ఆయన టోలిచౌకీ డివిజన్‌లోని పలు బస్తీల్లో పర్యటించారు. ప్రతివారం తాను నియోజకవర్గ పరిధిలోని ఒక్కో డివిజన్‌ను ఎంచుకొని ఆ డివిజన్ బస్తీల్లో పర్యటించి సమస్యలు తెలుసుకుంటున్నానన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల జాబితాను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించాలని అధికారులను కోరుతున్నానన్నారు. గత రెండు నెలలుగా తాను పర్యటించిన బస్తీల్లో నీటి సమస్యలపైనే ప్రజల నుంచి ఎక్కువగా ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ఆ సమస్యలను అప్పటికప్పుడు పరిష్కరించబడుతాయన్నారు. కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, టోలిచౌకీ డివిజన్ నాయకుడు హారూన్‌ఫరాన్, ఆలీముద్దీన్, వజీఉజ్‌జమా, ఏఈ ఉదయ్‌కుమార్ తదితరులున్నారు.

డయల్ యువర్ ఆర్టీసీ డీఎంకు విశేష స్పందన

గోల్కొండ: డయల్ యువర్ ఆర్టీసీ డీఎంకు విశేష స్పందన వచ్చిందని మెహిదీపట్నం డిపో మేనేజర్ బి.వి.కె.మూర్తి అన్నారు. శుక్రవారం నిర్వహించిన డయల్ యువర్ ఆర్టీసీ డీఎం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. క్రమం తప్పకుండా తాము ప్రజల నుంచి సలహాలు స్వీకరిస్తామన్నారు. దానికి అనుగుణంగానే బస్సు సర్వీసులు వారు కోరిన ప్రాంతాల్లో వేస్తున్నామన్నారు. ముఖ్యంగా కాలనీ సంక్షేమ సంఘాలు, వ్యాపారులు, విద్యార్థుల నుంచి ఎక్కువగా సూచనలు వస్తుంటాయన్నారు. ఇప్పటి వరకు తాము ప్రయాణికుల సూచనల మేరకు అదనపు బస్సులు వేశామన్నారు. మరికొన్ని ప్రాంతాలకు కొత్తగా బస్సు సర్వీసులు వేశామన్నారు.

శాతం చెరువులో దోమల మందు పిచికారీ



దోమల మందు పిచికారీ చేస్తున్న సిబ్బంది

గోల్కొండ: దోమలు వృద్ధిచెందకుండా బల్దియా ఎంటమాలజీ విభాగం వారు చెరువులు, నాలాల్లో తారోసిన్ ఆయిల్‌ను డ్రోన్ ద్వారా పిచికారీ చేయిస్తున్నారు. కొంత కాలంగా దోమలు విజృంభించి ప్రజల కంటి మీద కునుకు లేకుండా చేశాయి. ఈ విషయంపై కార్వాన్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే కౌసర్‌కు ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో ఆయన ఎంటమాలజీ విభాగం అధికారులను దోమల నివారణకు చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశించారు. ఈ మేరకు బల్దియా ఎంటమాలజీ విభాగం అధికారులు శుక్రవారం టోలిచౌకీ డివిజన్ శాతం చెరువులో డ్రోన్ ద్వారా దోమల మందు పిచికారీ చేశారు.

నేటి నుంచి చెస్ టోర్నమెంట్-2025

చార్మినార్: ఏపీజే అబ్దుల్ కలాం వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఈనెల 10, 11 తేదీల్లో చార్మినార్ ఓపెన్ రౌండ్ రాబిన్ చెస్ టోర్నమెంట్–2025 నిర్వహించనున్నామని నిర్వాహకులు తెలిపారు. పాతబస్తీ ఉర్దూఘర్‌లో ఉదయం 10 నుంచి సాయంత్రం 7 గంటల వరకు జరిగే ఈ చెస్ టోర్నమెంట్‌లో పాల్గొని విజేతలుగా నిలిచే విద్యార్థిని విద్యార్థులకు నగదు బహుమతి, మెరిట్ సర్టిఫికెట్, మెడల్స్ అందజేయనున్నామన్నారు. ముందుగా వచ్చిన వారికి ముందుగా అవకాశం కల్పించనున్నామన్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే పోటీదారుల సౌకర్యార్థం భోజన వసతి కల్పించడం జరిగిందన్నారు. పోటీలో పాల్గొనే విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు కోర్టులకు కూడా ఈ సదుపాయం ఉంటుందన్నారు. ఈ ఓపెన్ రౌండ్ రాబిన్ చెస్ టోర్నమెంట్ స్విస్ ఫార్మేట్‌లో కొనసాగనుందన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



సమావేశంలో కృష్ణ తదితరులు

అబిడ్స్: ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి భాగ్యనగర్ మున్సిపల్ జీహెచ్‌ఎంసీ ఎంప్లాయిస్ యూనియన్ నిరంతరం కృషి చేస్తుందని ఆ యూనియన్ బీఎంఎస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు టి.కృష్ణ పేర్కొన్నారు. జీహెచ్‌ఎంసీ ఖైరతాబాద్ జోన్ ఆధ్వర్యంలో శుక్రవారం పలువురు ఉద్యోగులు, కార్మికులు బీఎంఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ..జీహెచ్‌ఎంసీ కమిషనర్ దృష్టికి జీహెచ్‌ఎంసీ పరిధిలోని కార్మికులు, ఉద్యోగుల సమస్యలను ఎప్పటికప్పుడు తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామన్నారు. దీర్ఘకాలంగా ఉన్న కార్మికుల, ఉద్యోగుల సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల పక్షాన తమ యూనియన్ ఎళ్లవేళల అందుబాటులో ఉండి వారి ప్రగతికి, సంక్షేమానికి పాటుపడుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడంలో విఫలమవుతుందన్నారు. వెంటనే సమస్యలు పరిష్కరించనిచో ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు, కార్మికులు బీఎంఎస్‌లో చేరారు. వారికి కృష్ణ కండువాలు కప్పి యూనియన్‌లో చేర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో శివకృష్ణ, తిరుపతిరెడ్డి, ప్రమీళ, అన్నపూర్ణ, గడ్డం సుదర్శన్, భిక్షపతి, రూపేష్, ఖైరతాబాద్ జోనల్ సెక్రెటరీ ఆర్.వెంకటేష్, శ్రీకాంత్, భరత్, నరేందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

'భారత సైన్యానికి ఎదురు లేదు'



సీఐఎస్‌ఎఫ్ అధికారులతో డాక్టర్ నియాజ్ అహ్మద్ ఖాన్ తదితరులు

గోల్కొండ: భారత సైన్యానికి ఎదురు లేదని సాప్ మెడికల్స్ సీఈఓ డాక్టర్ మహ్మద్ నియాజ్ అహ్మద్ ఖాన్ అన్నారు. శుక్రవారం ఆయన ఆధ్వర్యంలో తానూర్‌కు చెందిన సీఐఎస్‌ఎఫ్ అధికారులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..శాంతిని కోరుకునే మన దేశం ఉగ్రవాదులను మాత్రం క్షమించదని ఉగ్రస్థావరాలను ధ్వంసం చేయడం భారతదేశ దృఢసంకల్పానికి నిదర్శనమన్నారు. ఏదేమైనా పాకిస్తాన్ కుట్రలను భగ్నం చేయడమే కాకుండా తగు రీతిలో గుణపాఠం చెప్పిన మన దేశానికి ఎదురు లేదన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మహ్మద్ షోహెబ్ అహ్మద్ ఖాన్, డాక్టర్ మహ్మద్ ఆకిబ్ అహ్మద్ ఖాన్ తదితరులు న్నారు.

రేపు ఏకశిలా లక్ష్మీనృసింహస్వామి జయంతి



ఏకశిలా లక్ష్మీనృసింహస్వామి

జియాగూడ: ఈ నెల 11న కార్వాన్ సాహులోని ఏకశిలా లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో జయంతి వేడుకలను భారీ ఎత్తున నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రతినిధులు పడాల అనంత్‌కృష్ణ, శ్యామ్ లింగం, ఎన్.శ్రీకాంత్, మణికంఠ ఆర్‌ఓఆర్.వినిత్, పి.గోపీ, పవన్, సురేందర్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ..స్వామి వారి జయంత్యుత్సవాలకు నగరం నుంచే కాక చుట్టుపక్కల గ్రామాల నుంచి సైతం హాజరవుతారన్నారు. ఆదివారం ఉదయం మూల ఏకశిలా లక్ష్మీనృసింహస్వామికి అభిషేకం, అలంకరణ, ప్రత్యేక పూజలు, సర్వదర్శనం, గోత్ర నామాలతో అర్చనలు, మధ్యాహ్నం 12 గంటలకు అఖండ హారతి, తీర్థ ప్రసాద పంపిణీ, భజనలు, కీర్తనలు, పల్లకీ సేవా, రాత్రికి మహా అన్నదానం నిర్వహిస్తున్నామన్నారు. కాగా ఆలయం గోడకు ఆనుకొని ఉన్న హైటెన్షన్ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వల్ల ఆలయ పరిసరాల్లో రంగులు, సున్నాలు, శుభ్రపరచలేకపోతున్నామన్నారు. పలుమార్లు ట్రాన్స్‌ఫార్మర్‌ను తరలించాలని విద్యుత్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా అధికారులు ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను వెంటనే తరలించాలని కోరారు.

ప్రజా సమస్యలను పరిష్కరించండి



బస్తీవాసులు, నాయకులతో సమావేశమైన ఆనంద్‌కుమార్ గౌడ్

అబిడ్స్: చుడిబజార్ పరిసర ప్రాంతాల్లో ఉన్న ప్రజా సమస్యలను పరిష్కరించకుంటే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని గోషామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ నాయకుడు ఎం.ఆనంద్‌కుమార్ గౌడ్ హెచ్చరించారు. శుక్రవారం చుడిబజార్ పరిసర ప్రాంతాల్లో బస్తీవాసులు, పలు శాఖల అధికారులతో కలిసి పర్యటించి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఆనంద్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ..చుడిబజార్ బస్తీల్లో డ్రైనేజీ సమస్యలు, విపరీతమైన దోమల బెడద ఉన్నా అధికారులు స్పందించడం లేదన్నారు. చుడిబజార్ ప్రాంతంలో పదేళ్ల క్రితం బీఆర్‌ఎస్ ప్రభుత్వం మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్‌ను ప్రారంభించినా నేటికి పూర్తికాలేదన్నారు. జీహెచ్‌ఎంసీ అధికారుల నిర్లక్ష్యంతోనే పనులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్ వెంటనే చుడిబజార్ మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్‌ను పర్యవేక్షించాలన్నారు. లేనిచో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వాటర్‌వర్క్స్ మేనేజర్ గురున్నాథ్, జీహెచ్‌ఎంసీ విద్యుత్ అధికారులతో పాటు బస్తీవాసులు వెంకటేష్, నాగరాజ్, రేవతి, విజయ, స్వరూప, రేణుకా, రాజేష్, ఖలీమ్, సుమన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టులో ఎవాక్యువేషన్ డ్రిల్



బాధితుడిని పై అంతస్తు నుంచి కిందికి దింపుతున్న సిబ్బంది

చార్మినార్: ఆపరేషన్ అభ్యాస్‌లో భాగంగా శుక్రవారం ఉదయం హైకోర్టు ఆవరణలో అకస్మాత్తుగా ప్రమాదం సంభవించినప్పుడు బాధితులను ఎలా రక్షించాలని దానిపై 'ఎవాక్యువేషన్ డ్రిల్' నిర్వహించారు. తెలంగాణ ఫైర్ ఎమర్జెన్సీ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ సివిల్ డిఫెన్స్ డిపార్ట్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ అవగాహన కార్యక్రమంలో ఎస్పీఎఫ్‌తో పాటు సివిల్ పోలీసులు, మెడికల్, విద్యుత్ తదితర విభాగాలకు చెందిన అధికారులు సిబ్బంది పాల్గొన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని భయంతో ఉన్న బాధితులను సురక్షితంగా కిందికి దింపి అంబులెన్స్ వాహనాల ద్వారా ఆసుపత్రులకు తరలించి వైద్య చికిత్సలు అందజేసే విధానాన్ని చక్కగా వివరించారు. హైకోర్టు చీఫ్ జస్టిస్ ఆదేశాల మేరకు జరిగిన ఈ కార్యక్రమంలో హైకోర్టు రిజిస్ట్రార్ వి.రమేష్, ఎస్పీఎఫ్ కమాండెంట్ అన్వర్ భాష, డీఎఫ్ఓ వెంకన్న, అసిస్టెంట్ కమాండెంట్ బాబు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యవస్థాపకత అభివృద్ధిపై శిక్షణ



నార్మ్స్‌లో శిక్షణలో పాల్గొన్న విద్యార్థులు, అధికారులు

ఏజీవర్సిటీ: విద్యార్థులు సంప్రదాయ విద్యా మార్గానికి భిన్నంగా ఆలోచించాలని... ఆ ఆలోచనలను ఆచరణలోకి తెచ్చేందుకు కృషి చేయాలని ఐసీఏఆర్ నార్మ్స్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ గోపాల్ లాల్ అన్నారు. శుక్రవారం రాజేంద్రనగర్‌లోని శ్రీ కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వ విద్యాలయంలో విద్యార్థులకు వ్యవస్థాపకత అభివృద్ధిపై నార్మ్స్‌లో మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. శిక్షణలో గోపాల్‌లాల్‌తో పాటు ఉద్యాన విశ్వవిద్యాలయం వీసీ దండా రాజిరెడ్డి పాల్గొని మాట్లాడారు. ముఖ్యంగా పట్టణ వ్యవసాయం, స్మార్ట్ వ్యవసాయం, వెల్నెస్ ఆధారిత ఉత్పత్తులు వంటి కొత్త వాటి గురించి అన్వేషించాలని సూచించారు. ఉద్యాన రంగంలో విద్యార్థులకు స్టార్టప్ రంగంలో పెరుగుతున్న అవకాశాల గురించి వివరించారు. ముఖ్యమైన నూనెలు, పర్యావరణ అనుకూల ఎరువులు వంటి విలువ ఆధారిత ఉత్పత్తులను వ్యాపార మార్గాలుగా పరిగణించాలని విద్యార్థులకు సూచించారు. వ్యవసాయం భవిష్యత్తు శాస్త్రీయ జ్ఞానాన్ని సృజనాత్మకతతో మిళితం చేసేవి వ్యాపారంలో ఉన్నాయని తెలిపారు. విద్యార్థులు ఉద్యోగాల గురించి ఆలోచించకుండా ఉద్యోగ ప్రదాతలుగా మారాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నార్మ్స్, ఉద్యాన విశ్వ విద్యాలయం అధికారులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ దొంగల అరెస్టు

పంజగుట్ట: స్విగ్గీ డెలివరీ బాయ్ సెల్‌ఫోన్ స్నాచింగ్ కేసులో ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు మరో నిందితుడి కోసం గాలిస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యూసుఫ్‌గూడకు చెందిన జావిద్ స్విగ్గీ డెలివరీ బాయ్. 5వ తేదీన రాత్రి డెలివరీ నిమిత్తం బేగంపేట నుంచి పంజగుట్టకు వచ్చాడు. పంజగుట్టలో డెలివరీ ఇచ్చేందుకు వెళ్లి తన ఫోన్‌ను ఆర్డర్ డైరెక్షన్ కోసం హ్యాండిల్‌కు ఉంచగా ఆ ఫోన్‌ను రెండు ద్విచక్రవాహనాలపై వచ్చిన నలుగురు నిందితులు దొంగిలించారు. గమనించిన జావిద్ అక్కడకు పరిగెత్తుకుంటూ వెళ్లగా అతడిని నెట్టేసి ఫోన్ తీసుకుని పరారయ్యారు. సీసీ కెమెరాలు పరిశీలించిన పోలీసులు నిందితులు బోడుప్పల్, పీర్జాదిగూడకు చెందిన ప్రమోద్(21), శ్రావణ్(22), రాజేష్(22), మహేష్(20)గా గుర్తించారు. వీరు అదే రోజు మాదాపూర్‌కు వెళ్లి అక్కడ రెండు సెల్‌ఫోన్లు స్నాచింగ్ చేశారు. అంతేకాకుండా మాదాపూర్‌లో ఒక పెట్రోల్‌బంక్‌లో పెట్రోల్ కొట్టించుకుని వారికి డబ్బులు ఇవ్వకుండా పరారయ్యారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు శుక్రవారం శ్రావణ్, రాజేష్, ప్రమోద్‌ను అదుపులోకి తీసుకున్నారు. మహేష్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు నిందితులను రిమాండ్‌కు తరలించారు.